ఓపెన్ ఇంటర్ సెంటర్ తనిఖీ

కల్వకుర్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్ సెంటర్‌ను రాష్ట్ర కోఆర్డినేటర్ జీ. దామోదర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు ఇంటర్ ద్వారా గ్రూప్-1, గ్రూప్-2 స్థాయికి ఎదిగారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. క్లాసుల నిర్వహణ, రిజిస్టర్లు, పుస్తకాల పంపిణీ గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రమాకాంత్, కళాశాల అధ్యాపకులు సదానందం, శ్రీనివాస్, లక్ష్మీకాంత్‌సాగర్, లక్ష్మయ్య ఉన్నారు.

సా..గుతున్న నిర్మాణాలు

ప్రాజెక్టులు పరిహాసం -3

- నత్తనడకన ప్రాజెక్టుల పనులు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పాలమూరు-రంగారెడ్డి
- కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఫీడర్ ఛానల్స్ నిర్మాణంలో అలసత్వం
- చాలా ప్రాజెక్టుల్లో పెండింగ్‌లో భూ సేకరణ.. అందని పరిహారం
- రన్నింగ్ ఎత్తిపోతల పథకాల్లోనూ పూర్తికాని ఆయకట్టు స్థిరీకరణ
- పాలమూరు ప్రాజెక్టులకు ఫాస్ట్‌ట్రాక్‌లో నిధులకు ప్రభుత్వం హామీ



బిజినేపల్లి మండలం వట్టెం వద్ద కొనసాగుతున్న రిజర్వాయర్ పనులు



నాగర్‌కర్నూల్ జిల్లా ఎల్లూరు వద్ద పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో ఏర్పాటు చేస్తున్న పంపులు

మహబూబ్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలమూరు కరువు నేలలో పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టులు.. ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపడుతున్న విషయం తెలిసిందే. రెండు దశాబ్దాల క్రితం శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల నుంచి పదేళ్ల క్రితం శ్రీకారం చుట్టిన ప్రాజెక్టుల వరకూ ఏ పనులను పూర్తి చేయకపోడంతో నిర్దేశిత ఆయకట్టు స్థిరీకరణ జరగడం లేదు. రైతుల మెప్పు పొందడం కోసం పలు తాత్కాలిక పద్ధతుల ద్వారా నీరందిస్తున్నప్పటికీ.. ఒక ప్రాజెక్టుకు ఉండాల్సిన విధంగా ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఫీడర్ ఛానల్‌ను మాత్రం నిర్మించడం లేదు. అందుకే అవి సంవత్సరాలు గడుస్తున్నా పెండింగ్ ప్రాజెక్టులుగా ఉంటున్నాయి. ఏటా వందల కోట్ల బడ్జెట్ పెట్టడం, అంచనాలు పెరగడం, అది కాంట్రాక్టర్లకు వరంగా మారడం అనవాయితీగా వస్తోంది. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి, తుమ్మిళ్ల, గట్టు ఎత్తిపోతల పథకాలన్నింటిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల పలుమార్లు పాలమూరు ప్రాజెక్టుల పూర్తికి ఫాస్ట్రాక్‌లో నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ దఫాలోనైనా పలు పెండింగ్ పనులు పూర్తవుతాయని రైతులు ఎదురుచూస్తున్నారు.

పీఆర్ఎల్ఐలో ఇలా..

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా మొదట ఐదు లిఫ్టులు, ఆరు రిజర్వాయర్లు నిర్మించాలని ప్రతిపాదించారు. తర్వాత కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్, లిఫ్టులను చేపట్టకూడదని నిర్ణయించారు. మిగిలిన మొత్తంలో 36.64 కిలోమీటర్ల అప్రోచ్, ఓపెన్ కెనాల్స్, 47.177 కిలోమీటర్ల టన్నెల్,

(మిగతా 6లో..)



నాగర్‌కర్నూల్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రం వద్ద గ్రూప్-2 అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

మొదటి రోజు ప్రశాంతం

- నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 32 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్ష
- పేపర్-1కు 4,772 మంది, పేపర్-2కు 4,976 మంది అభ్యర్థులు హాజరు
- గంగాపూర్ చెన్నకేశవ స్వామి ఆలయం, పిల్లలమర్రి గురించి ప్రశ్న
- నేడు పేపర్ 3,4 పరీక్ష

నాగర్‌కర్నూల్‌టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలో గ్రూప్-2 పరీక్ష మొదటిరోజు ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 32 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు మొదటి రోజు 49 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 9,731 మంది అభ్యర్థులకు గాను ఉదయం పేపర్-1 కు 4,772 మంది హాజరు కాగా మధ్యాహ్నం పేపర్-2 కు 4,976 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పేపర్-1 పరీక్ష ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం కాగా పేపర్-2 పరీక్ష మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమైంది. పరీక్ష సమయానికి అరగంట ముందే అభ్యర్థులను హాల్‌లోకి అనుమతించి గేట్లు మూసివేశారు. దీంతో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించకపోవడంతో వెనుదిరిగిపోయారు. జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల కేంద్రం వద్ద ఉదయం నిర్వహించిన పేపర్-1 పరీక్షకు ఇద్దరు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వారిని లోపలికి అనుమతించలేదు. పరీక్షలో గంగాపూర్ చెన్నకేశవస్వామి ఆలయం, పిల్లలమర్రి గురించి ప్రశ్నలు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

మరిన్ని చిత్రాలు 6



మద్దిమడుగు అంజన్న సన్నిధిలో మహాహారతిని స్వీకరిస్తున్న భక్తులు

మద్దిమడుగు అంజన్నా..

మళ్లీ వస్తామయ్యా

- మద్దిమడుగు అంజన్న దర్శనానికి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- మాలీజనే ప్రత్యేక నైవేద్యంగా అగ్నిగుండంలో సమర్పణ

7

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ టంగుటూరి శ్రీను

7

గోవింద నామస్మరణతో మార్మోగిన రామాపురం



లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

7

బసవన్న చౌరస్తాగా నామకరణం

చారిత్రాత్మకం

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి
- రైతు ప్రాధాన్యతకు చిహ్నంగా కూడలి



బసవన్న చౌరస్తాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నడిగడ్డకు ఉన్న ప్రత్యేక సంస్కృతిని ప్రతిబింబించే రీతిలో పట్టణంలో బసవన్న చౌరస్తా ఏర్పాటు చేసుకోవడం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అభివర్ణించారు. గద్వాల పట్టణంలోని రెండో రైల్వేగేటు సమీపంలో గతంలో బీరెల్లి క్రాస్ రోడ్డుగా గుర్తింపు ఉన్న ఈ కూడలి వద్ద కాడెద్దులు, నాగలితో ఉన్న రైతు విగ్రహాలను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ కూడలికి బసవన్న చౌరస్తాగా నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక వైపు కర్ణాటక, మరో వైపు ఆంధ్ర సరిహద్దులో ఉన్న నడిగడ్డకు విభిన్నమైన సంస్కృతి, సంప్రదాయాలు వారసత్వంగా లభించాయన్నారు. కాడెద్దులను బసవన్నలుగా, దైవ సమానంగా పూజించే సంస్కృతి ఉన్న మన ప్రాంతంలో అదే పేరుతో చౌరస్తాను ఏర్పాటు చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కాగా, పట్టణ సర్వతోముఖాభివృద్ధి కోసం నిబద్ధతతో కృషిచేస్తున్నట్లు తెలిపారు. రానున్న నాలుగేళ్లలో పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు సౌకర్యాలను మరింత మెరుగు పరుస్తానని తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎద్దుల బండిపై ఊరేగింపుగా తరలిరావడంతో ఈ ప్రాంతం కోలాహలంగా మారింది.

కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ ఎండీ బాబర్, జడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు గడ్డం కృష్ణారెడ్డి, పచ్చర్ల శ్రీధర్ గౌడ్, మునిసిపల్ మాజీ చైర్మన్ వేణుగోపాల్, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కల్వకుర్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏడవ వార్డులో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, వార్డు అధికారి శ్రీలత, కమిటీ సభ్యులు మహ్మద్‌సుభూ, నాయకులు శమిందు సర్వేలో పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న అధికారులు

రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలి

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

వనపర్తి అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వనపర్తి పట్టణంలో నిర్వహించనున్న జాబ్, స్కిల్ డెవలప్‌మెంట్, రుణమేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21న నిర్వహించాల్సి ఉండగా అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వాయిదా వేశామని, త్వరలోనే తేదీని ఖరారు చేస్తామని తెలిపారు. ఆసక్తి గల యువతీ, యువకులు పూర్తి వివరాలకు స్థానికంగా ఉండే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. వ్యాపారం కోసం దాదాపు రూ.200 నుంచి రూ.300 కోట్ల వరకు రుణమేళా కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. వనపర్తి నియోజకవర్గ యువత, వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలతో పాటు, వ్యాపార రంగాలలో రాణించేందుకు రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్, మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, డీసీసీ డెలిగేట్ మెంబర్ శంకర్ ప్రసాద్, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

90 రోజుల ప్రణాళిక

ఫలితమిచ్చేనా..?

- ఇంటర్ ఉత్తీర్ణత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ
- గద్వాల జిల్లాలో ఐదేళ్లుగా 60 శాతం దాటని ఇంటర్ ఉత్తీర్ణత
- డిసెంబరు 3 నుంచి ప్రత్యేక తరగతులు
- తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు
- జిల్లాలో పరీక్ష రాయనున్న 5,475 మంది విద్యార్థులు



అయిజలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

ఇంటర్‌లో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. ఆయా కళాశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. కానీ ప్రత్యేక తరగతుల సమయంలో విద్యార్థులకు అల్పాహారం అందిస్తే బాగుండేదని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

6

- అయిజటౌన్, ఆంధ్రజ్యోతి

భక్తి శ్రద్ధలతో దాసంగాలు



అయిజలోని కట్టకింద వేంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో నైవేద్యాలు సమర్పించేందుకు దాసంగాలను సిద్ధం చేస్తున్న భక్తులు

అయిజ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని గద్వాల రహదారిలో ఉన్న చెరువు కట్టకింది వేంకటేశ్వరస్వామికి ఆదివారం భక్తులు భక్తి శ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించారు. మల్దకల్ మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అక్కడికి వెళ్లలేని భక్తులు ఇక్కడే దాసంగాలతో నైవేద్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఆదివారం మల్దకల్‌లో రథోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులు ఇక్కడ దాసంగాలు సమర్పించారు. భక్తులతో ఆలయ పరసరాలు కిటకిటలాడాయి. అదేవిధంగా మల్దకల్‌లో జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తులు ఎద్దుల బండ్లు, ఆటోలు, వివిధ వాహనాలలో భారీ సంఖ్యలో తరలివెళ్లారు. అయిజ మండలంలోని ఉత్తనూర్‌లో ప్రతీనెల పౌర్ణమి రోజున శ్రీదేవి, భూదేవి సమేత ధన్వంతరి వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం రథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు.

ప్రజల పక్షాన పోరాడేది

ఎర్రజెండానే

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాగర్



మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాగర్

అచ్చంపేటటౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజల పక్షాన పోరాడే ఏకైక పార్టీ ఎర్రజెండా అని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాగర్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా సీపీఎం మూడో జిల్లా మహాసభలలో భాగంగా రెండోరోజు ప్రతినిధుల సభను పట్టణంలోని లోటస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. నాగర్‌కర్నూలు జిల్లాకు నల్లమల అడవులు ఆనుకొని ఉన్నందున ప్రభుత్వం కాగితపు పరిశ్రమ నెలకొల్పి ఈ ప్రాంతంలో గిరిజన, దళితులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ చెప్పి ఏడాది గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదన్నారు. దేశంలో ప్రజలకు ఎక్కడ ఆపద వచ్చినా అక్కడ ఎర్రజెండా ఉంటుందన్నారు. లగచర్ల భూముల విషయంలో గిరిజనులకు అండగా ఎర్రజెండా పోరాటం చేసిందన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రశ్నించే గొంతులను నిర్బంధించడం, దాడులు చేయడం, అర్బన్ నక్సలైట్ ముద్రవేసి అరెస్టు చేసి ఏళ్ల తరబడి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా నియంతృత్వ ధోరణితో పోవడం వల్ల ప్రజలు ఓడించారని గుర్తు చేశారు. కార్యక్రమం లో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్ వెస్లీ, రాష్ట్ర నాయకులు గోపాల్, వెంకట్, రాములు, ధర్మానాయక్, సీపీఎం జిల్లా కార్య దర్శి పర్వతాలు, కార్యవర్గ సభ్యుడు దేశ్యా నాయక్, నాయకులు శ్రీనివాసులు, అంజనేయులు, శంకర్, సైదులు ఉన్నారు.



నెట్టెంపాడు 99 ప్యాకేజీ కింద చేపట్టిన పనులు



ఎల్లూరు వద్ద ఏర్పాటు చేసిన టన్నెల్



మహబూబ్‌నగర్ జిల్లా వల్లూరు వద్ద కొనసాగుతున్న ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు



ఎల్లూరు వద్ద ఎంజీఎల్ఐ ప్రాజెక్టు లిఫ్ట్ -1 నిర్మాణం

సా..గుతున్న నిర్మాణాలు

ప్రాజెక్టులు - పరిహాసం 3

(మొదటి పేజీ తరువాయి)

68.65 కిలోమీటర్ల కట్ట, 65.17 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పటివరకు ఎర్త్ వర్క్‌కు సంబంధించి 3730 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 3181 లక్షల క్యూబిక్ మీటర్లు పూర్తయ్యింది. కాంక్రీట్ వర్క్ 53.01 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 25.85 లక్షల క్యూబిక్ మీటర్లు పూర్తయ్యింది. దాదాపు సగం కంటే ఎక్కువగా కాంక్రీట్ వర్క్ పూర్తి కావాలి. దాదాపు రిజర్వాయర్లన్నీ 90 శాతం వరకు పూర్తయ్యాయి. అయితే ఓపెన్ కెనాల్స్ టన్నెల్ పనులు మాత్రం పూర్తి కాలేదు. నార్లాపూర్‌లో గత సంవత్సరం హడావిడిగా ఏదులకు నీటిని తరలించేందుకు కెనాల్స్ పూర్తికాకముందే హడావిడిగా ఒక మోటార్‌ను ప్రారంభించారు. కానీ ఆ ఎత్తి పోసిన మూడు టీఎంసీల నీటిని వినియోగించుకోలేకపోయారు. నార్లాపూర్‌లో నాలుగో పంపు బిగిస్తుండగా, ఏదుల పంప్‌హౌజ్‌లో మూడు మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. వట్టెం మోటార్ల బిగింపు, క్రస్ట్‌గేట్లు, గ్రావిటీ కాలువల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉదండాపూర్ వద్ద పంప్‌హౌస్ పనులు పెండింగ్‌లో ఉండగా, గ్రావిటీ కాలువలు కూడా నిర్మించ లేదు. ఇవి కాకుండా ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీల కోసం అసలు భూసేకరణే చేపట్టలేదు. ఈ ప్రాజెక్టుకు 27,047 ఎకరాలు భూమి కావాల్సి ఉండగా.. 26,872 ఎకరాలు సేకరించారు. ఇంకా 175 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ప్రాజెక్టు పనులతోపాటు సమాంతరంగా జరగాల్సిన కాలువలు, పంప్‌హౌస్‌లు, టన్నెల్స్ నిర్మాణం ఆశించన వేగంగా జరగడం లేదని చెప్పొచ్చు.

కల్వకుర్తిలో ఇలా..

కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారంగా 2005లో చేపట్టారు. ప్రారంభంలో 25 టీఎంసీలను ఎత్తిపోయడం ద్వారా 3.65 లక్షల ఎకరాలకు నీరివ్వాలని లక్ష్యంగా పెట్టుకుని, రూ.2,100 కోట్ల అంచనా వ్యయం నిర్దేశించారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రాజెక్టును రీడిజైన్ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం 25 టీఎంసీలను 40 టీఎంసీలకు పెంచింది. ప్రాజెక్టు ఆయకట్టును కూడా 4.50 లక్షలకు పెంచింది. అయితే ఇప్పటివరకు 3.40 లక్షల ఎకరాలకు మాత్రమే నీరందుతోంది. ఇంకా 1.60 లక్షల ఎకరాలకు నీరివ్వాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు కల్వకుర్తి పేరుతో ప్రారంభించినా.. ఇప్పటివరకు కల్వకుర్తి అక్కడి పూర్తి స్థాయిలో నీరందడం లేదు. ప్రధాన రిజర్వాయర్లుగా ఉన్న జొన్నలబొగుడ, ఎల్లూరు, గుడిపల్లి గట్టు, సింగోటం రిజర్వాయర్ల సామర్థ్యం కలిపి నాలుగు టీఎంసీలలోపే ఉంది. దీంతో నీటిని ఆశించిన స్థాయిలో వినియోగించుకోవడం లేదు. అలాగే డిస్ట్రిబ్యూటరీల పనులు పూర్తికాకపోవడం, లైనింగ్ లేకపోవడంతో తరచూ గండ్లు పడుతున్నాయి. పంట కాలువ వ్యవస్థ లేకపోవడంతో రైతులు మోటార్లు ఏర్పాటు చేసుకుని సాగు చేస్తున్నారు. గొలుసుకట్టు చెరువులపైనే ఆధారపడటంతో ఫీడర్ ఛానల్స్‌ను నిర్మించలేదు. కల్వకుర్తి వరకు నీరందించేందుకు ఉద్దేశించిన డీ82 పనులు నత్తనడకన సాగుతున్నాయి.

నెట్టెంపాడు అంతే..

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కింద నిర్మించిన గుడ్డెందొడ్డి రిజర్వాయర్‌లో కుడి కాలువ కింద వేల ఎకరాలకు నీరందుతోంది. ఎడమ కాలువ 76 కిలోమీటర్ల దూరం ప్రయాణించి, 63 వేల ఎకరాలకు నీరివ్వాల్సి ఉంది. ఈ కాలువను 99, 100 ప్యాకేజీలుగా విభజించగా, ఇప్పటివరకు పూర్తి కాలేదు. గద్వాల మండలం కొండపల్లి వద్ద అక్విడెక్ట్ నిర్మాణం పెండింగ్‌లో ఉండటంతో పదేళ్లుగా సాగునీటికి నోచుకోవడం లేదు. ర్యాలంపాడు రిజర్వాయర్‌ను మొదట 2.3 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. ఆ తర్వాత నాలుగు టీఎంసీలకు పెంచారు. దీనికింద 1,38,000 ఎకరాల ఆయకట్టు ఉంది. ధరూర్, కేటీదొడ్డి, గట్టు, మల్దకల్, గద్వాల, అయిజ మండలాలకు సాగునీరు అందుతోంది. ఈ రిజర్వాయర్ కింద సంగాల, తాటికుంట, నాగర్‌దొడ్డి, ముచ్చోనిపల్లి, చిన్నోనిపల్లి రిజర్వాయర్‌లు ఆఫ్‌లైన్ పద్ధతిలో నిర్మించారు. వీటి సామర్థ్యం 6.6 టీఎంసీలు కాగా ఇందులో సంగాల రిజర్వాయర్‌లోకి నీళ్లు రావడానికి డైవర్షన్ కాలువ లేదు. అంతేకాకుండా సాగు కూడా లేదు. చిన్నోనిపల్లి రిజర్వాయర్ పూర్తి కాలేదు. ప్రధాన జలాశయం అయిన ర్యాలంపాడు, ముచ్చోనిపల్లి రిజర్వాయర్‌కు లీకేజీలు ఉన్నాయి.

పరుగో పరుగు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన గ్రూప్ 2 పరీక్ష నేపథ్యంలో చివరి నిముషంలో అభ్యర్థులు కేంద్రాలకు ఉరుకులు పరుగులు పెట్టారు. సమయం గడిచాక వచ్చిన వారిని అధికారులు అనుమతించకపోవడంతో కన్నీరు పెట్టుకున్నారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయగా, కలెక్టర్లు కేంద్రాలను తనిఖీ చేశారు.

-ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్

కేంద్రాలను తనిఖీ చేసిన డీఐజీ

మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి: గ్రూప్ 2 పరీక్షకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద పోలీసులను మొహరించి అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ చట్టం అమలు చేశారు. కేంద్రాలను జోగులాంబజోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ జానకి తనిఖీ చేశారు. డీఐజీ మాట్లాడుతూ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నామని, అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నామన్నారు. ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు అవసరమైన సౌకర్యాలను పోలీస్‌శాఖ కల్పిస్తుందని చెప్పారు.

గర్భిణికి పోలీసు సహకారం

పరీక్ష రాసేందుకు కేంద్రం వద్దకు వచ్చిన ఓ గర్భిణికి పోలీసులు సహకరించారు. మహబూబ్‌నగర్ సమీపంలోని జేపీఎన్ఈసీ కేంద్రం గేటు నుంచి పరీక్ష హాల్ కొంతదూరంలో ఉండటంతో ఆమెను పోలీసు కారులో ఎక్కించుకుని, హాలు వద్ద దించేందుకు డీఐజీ, ఎస్పీలు సహకరించారు.



టైం ముగుస్తుండటంతో మహబూబ్‌నగర్‌లోని ఓ పరీక్ష కేంద్రానికి పరుగున వస్తున్న అభ్యర్థిని

పాలమూరు గురించి ప్రశ్న

జడ్చర్ల, ఆంధ్రజ్యోతి : గ్రూప్-2 పరీక్ష పేపర్-1 ప్రశ్నపత్రంలో మహబూబ్‌నగర్ జిల్లా గంగాపురం, పిల్లలమర్రి గురించి ప్రశ్న వచ్చింది. దేవాలయాలు, అవి ఉన్న ప్రాంతాలను జతపరచాలంటూ ఇచ్చిన ఓ ప్రశ్నలో నాలుగు దేవాలయాలు, నాలుగు ప్రాంతాలను పొందుపరిచారు. అందులో గంగాపురంలోని చెన్నకేశవస్వామి దేవాలయంతో పాటు పిల్లలమర్రిలోని ఎరకేశ్వర దేవాలయం పేరు ఇచ్చారు.



వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రం వద్దకు పరుగున వస్తున్న అభ్యర్థి



మహబూబ్‌నగర్‌లో ఓ అభ్యర్థిని పరీక్ష కేంద్రానికి తీసుకొస్తున్న కానిస్టేబుల్



ఆలస్యంగా రావడంతో మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రం నుంచి వెనుదిరుగుతున్న అభ్యర్థిని



వనపర్తి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చినందున అధికారులు అనుమతించకపోవడంతో రోదిస్తున్న ఓ అభ్యర్థిని



పోలీస్ కారులో గర్భిణిని పరీక్ష హాలుకు తీసుకెళ్తున్న పోలీసులు, చిత్రంలో డీఐజీ చౌహాన్, ఎస్పీ జానకి



గద్వాలలో ఓ కేంద్రంలోకి వస్తున్న అభ్యర్థులు



మహబూబ్‌నగర్ బాలుర కళాశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

కబ్జా భూమి పరిశీలన



జూరాల కాల్వ పక్కన కబ్జాకు గురైన భూమిని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెబ్బేరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని జూరాల ఎడమ కాల్వ పక్కన కబ్జాకు గురైన భూమిని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదివారం రాత్రి పరిశీలించారు. పెబ్బేరు, వనపర్తి రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోతున్న 164 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉంది. వారికి స్థలాలు ఇవ్వడానికి జూరాల కాలువ పక్కల కబ్జా గురైన దాదాపు మూడు ఎకరాల భూమిని మునిసిపాలిటీ అధికారులు కబ్జాలను తొలగిస్తున్నారు. ఈ స్థలంలో ప్లాట్లు సరిపోకుంటే మరో స్థలాన్ని ఎంపిక చేయాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. రోడ్డు వెడల్పులో నష్టపోయిన ప్రతీ బాధితుడికి ప్లాటు, ఇల్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ ఎం. కర్రెస్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి. శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దుల విజయ వర్ధన్ రెడ్డి, ఎద్దుల సాయినాథ్, ఎల్లారెడ్డి, గోపిబాబు, అక్కమ్మ, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, సాగర్, రంజిత్ కుమార్, గంధం రాజశేఖర్‌రెడ్డి, వెంకటరమణ, యుగంధర్ రెడ్డి, రాములుగౌడ్, వెంకటన్నగౌడ్, రవీందర్ నాయుడు, నరిసింహనా యుడు, రాములు, శివ ఉన్నారు.

90 రోజుల ప్రణాళిక ఫలితమిచ్చేనా..?

- ఇంటర్ ఉత్తీర్ణత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ



అయిజలో సమావేశానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

అయిజటౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. 90 రోజుల ప్రత్యేక ప్రణాళికా పేరుతో ఆయా కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఫలితాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల అధికారులను ఆదేశించింది. దీంతో కళాశాలల అధ్యాపకులు ఇప్పటికే ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు.

గద్వాల జిల్లాలో ..

గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో ఇంటర్ విద్యాబోధన జరిగే ప్రభుత్వ రెసిడెన్సియల్, నాన్ రెసిడెన్సియల్, కేజీబీవీలు కలిపి మొత్తం 28 కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 5,475 మంది ఉన్నారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించే బాధ్యత తీసుకున్నారు.

ప్రణాళిక ఇలా..

ఇంటర్ విద్యార్థులకు ఉత్తీర్ణత పెంచేందుకు 90 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతీరోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి 9:45 వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. డిసెంబరు చివరి నాటికి ఇంటర్ సిలబస్ మొత్తం పూర్తిచేయాలి. జనవరి, ఫిబ్రవరి నెలల్లో స్లిప్‌టెస్ట్ నిర్వహించాలి. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి వారికి సులభంగా అర్థమయ్యే విధంగా చూడాలి.

తల్లిదండ్రులకు అవగాహన..

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతీ 20 రోజులకు ఒకసారి కళాశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి తగు సూచనలు చేస్తున్నారు. ఇంటివద్ద ఉన్న సమయంలో విద్యార్థులు ఏమి చేస్తున్నారన్న విషయాన్ని ఖచ్చితంగా గమనించాలని, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచేలా చూడాలని, అవసరం అయితే కళాశాలకు వచ్చి విద్యార్థి ప్రొగ్రెస్ తెలుసుకోవాలని సూచిస్తున్నారు.

అయిదేళ్లుగా 63 శాతం ఉత్తీర్ణత దాటలే..

2017-18 విద్యాసంవత్సరంలో మొదటి సంవత్సరం 40 శాతం, రెండో సంవత్సరం 44 శాతం, 2018-19 విద్యాసంవత్సరంలో మొదటి సంవత్సరం 54 శాతం, రెండో సంవత్సరం 51 శాతం ఉత్తీర్ణత సాధించాయి. 2019-20, 2020-21 విద్యాసంవత్సరాల్లో కరోనా కారణంగా 100 శాతం ఉత్తీర్ణతతో అందరూ పాసయ్యారు. 2021-22 విద్యాసంవత్సరంలో మొదటి సంవత్సరం 55 శాతం, రెండో సంవత్సరం 60 శాతం, 2022-23 విద్యాసంవత్సరంలో మొదటి సంవత్సరం 51 శాతం, రెండో సంవత్సరం 58 శాతం, 2023-24 విద్యాసంవత్సరంలో మొదటి సంవత్సరం 53 శాతం, రెండో సంవత్సరం 63 శాతం ఉత్తీర్ణత సాధించారు.

పిల్లలకు ఎంతో ఉపయోగం



ప్రత్యేక తరగతులు పిల్లలు బాగా చదివేందుకు ఉపయోగపడతాయి. మా కూతురు రేవతి అయిజలోని గవర్నమెంట్ కాలేజీలో చదువుతోంది. ప్రత్యేక తరగతుల వల్ల మార్కులు కూడా పెరుగుతాయి. పిల్లలకు అల్పాహారం అందిస్తే బాగుండేది.

- గోవిందమ్మ, (విద్యార్థి తల్లి) తనగల గ్రామం, వడ్డేపల్లి

ప్రత్యేక తరగతులతో మెరుగవుతున్నాం



తరగతిగదిలో అర్థం కాని సబ్జెక్ట్ గురించి ప్రత్యేక తరగతుల్లో అడిగి తెలుసుకుంటున్నాం. చదివింది బాగా గుర్తుండేందుకు మా సారు వాళ్లు చిన్నచిన్న చిట్కాలు చెబుతున్నారు. పరీక్షల కోసం ముఖ్యమైన పాఠాలు గుర్తించి చదివిస్తున్నారు.

- నరేష్, బైపీసీ, లింగాపురం గ్రామం, గట్టు మండలం

ఉత్తీర్ణత పెంచేందుకే...



ప్రభుత్వం 90 రోజుల ప్రణాళికా ద్వారా ఇంటర్ కాలేజీల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకు అనుగుణంగానే జిల్లాలో ఉన్న 28 కాలేజీల అధ్యాపకులకు ప్రతీరోజు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాం. అన్ని కళాశాలల్లో ఈ తరగతులు కొనసాగుతున్నాయి. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో తరగతులు నిర్వహిస్తున్నాం.

- హృదయరాజు, ఇంటర్ నోడల్ అధికారి, గద్వాల

ఆరు గ్యారెంటీలపై షార్ట్‌ఫిలిమ్

తెలకపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆరు గ్యారెంటీలపై షార్ట్ ఫిలిమ్‌ను మండల కేంద్రంలో చిత్రీకరించారు. ఐజీపీఆర్ సూచనల మేరకు షార్ట్ ఫిలిమ్ చిత్రీకరణ జరిగినట్లు రాందాస్‌నాయక్ తెలిపారు. వి.రమణారెడ్డి దర్శకత్వంలో ఆరు గ్యారెంటీలపై చిత్రీకరణ జరిపారు. పథకాల గురించి ఈ షార్ట్ ఫిలిమ్‌లో ప్రస్తావించారు. ఇంతకు ముందు ఈ ఫిలిమ్ వనపర్తి, నాగర్‌కర్నూల్‌లో చిత్రీకరించినట్లు వారు తెలిపారు. ఈ ఫిలిమ్‌కు కో డైరెక్టర్‌గా శ్రీకాంత్, చిత్ర బృందం పాల్గొన్నారు.



షార్ట్ ఫిలిమ్ చిత్రీకరిస్తున్న చిత్ర బృందం సభ్యులు

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అమరచింత, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.అజయ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. భూమి లేని వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం రూ.12 వేలు ఇస్తానని నేటికీ అమలు చేయడం లేదని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు 200 దినాలతో పాటు కూలీ ధరలను పెంచాలని కోరారు. గత ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనులను కొనసాగిస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసినా.. అది నేటికీ అమలు కాలేదని అన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాల్లో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- తపస్ జిల్లా అధ్యక్షుడు దెంది రాజారెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు దెంది రాజారెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరవధిక సమ్మె శిబిరాన్ని ఆదివారం తపస్ జిల్లా నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు కాంట్రాక్టు పద్ధతిన ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారిని క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలపై తపస్ ఆధ్వర్యంలో ఈ నెల 17న హైదరాబాదు ఇందిరాపార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్మదీక్ష వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్, జిల్లా ప్రచార కార్యదర్శి రాజశేఖర్‌రావు, నాయకులు బాలరాజు, నరేందర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ పట్టణంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతున్న తపస్ జిల్లా అధ్యక్షుడు దెంది రాజారెడ్డి

జములమ్మ ఆలయంలో ఘనంగా పౌర్ణమి వేడుకలు

గద్వాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జములమ్మ తల్లి ఆలయంలో ఆదివారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులతో పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని ఆలయంలోకి చేర్చారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారి పల్లకీ సేవలో ఆలయ అధికారులు, భక్తులు

మైసమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



మైసమ్మ దేవతను దర్శనం చేసుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తుల కొంగు బంగారంగా వెలిసిన మైసమ్మ దేవత దర్శనం కోసం ఈ ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి జిల్లా నలుమాలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 20వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తుల నుంచి ఈ ఆదివారం టికెట్ల ద్వారా 52,320 రూపాయలు, హుండీ ద్వారా రూ. 96,782, మొత్తం ఒక లక్షా 49వేల 102 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వర్ శర్మ, చైర్మన్ శ్రీనివాసయాదవ్ తెలిపారు.

క్రైం కార్నర్

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

● రూ. 72 వేల రికవరీ

గద్వాల క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో పలు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను పట్టుకొని అతని నుంచి రూ. 72 వేలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ టంగుటూరి శ్రీను అన్నారు. అదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో గత కొన్ని రోజులుగా దొంగతనాలకు పాల్పడుతున్న అం తర్రాష్ట్ర దొంగను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టణంలోని కృష్ణవేణి చౌరస్తాలో శనివారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న వికారబాద్ జిల్లాకు చెందిన కావలి సురేందర్ అలియాస్ శ్రీధర్ దుకాణాల వైపు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. కృష్ణవేణి చౌరస్తా సమీపంలో ఉన్న కృష్ణారెడ్డి హాస్పిటల్ దొంగతనంతో పాటు మరికొన్ని దొంగతనాలల్లో సురేందర్ ప్రధాన నిందితుడన్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన మూడు దొంగతనాలకు సంబంధించి అతడిని విచారించగా.. తాను చేసిన నేరాలను ఒప్పుకోవడంతో పాటు అతని దగ్గర ఉన్న రూ. 72వేల నగదును రికవరీ చేశామన్నారు. పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

కర్ణాటక ధాన్యం లారీలు సీజ్

కృష్ణ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం సురుపూరు తాలూకా నుంచి ఎలాంటి ఆధారాలు లేకుండా రాష్ట్రానికి తరలిస్తున్న ధాన్యం లారీలను సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీ గురురాజారావు తెలిపారు. నారాయణపేట జిల్లా క్రిష్ణా మండల పరిధిలోని కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ఉన్న చేగుంట గ్రామం వద్ద జాతీయ రహదారి 150 పక్కన ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శుక్రవారం మధ్య రాత్రి రాష్ట్రంలోకి వస్తున్న ఆరు వరి ధాన్యపు లారీలను పోలీసులు తనిఖీలు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కృష్ణ పోలీసులు స్టేషన్‌కు తరలించి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఆదివారం పరిశీలించగా ఆరు లారీలలో అందాజగా 2430 బస్తాల ధాన్యం ఉందని, దీనికి సంబంధించిన ఎలాంటి అధారాలు చూపించకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

కోస్గి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో హుండీని దుండగులు పగలగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ఆదివారం ఎస్సై బాల్‌రాజ్ కథనం మేరకు.. ఆదివారం ఉదయం తెల్లవారుజామున ఆలయంలో ఉన్న హుండీని గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. గ్రామస్థుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. హుండీలో సుమారు డెబ్బైవేలు ఉండవచ్చని గ్రామస్థులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధం



గడ్డి వాము మంటలను ఆర్పుతున్న స్థానికులు

అలంపూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నాలుగు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని లింగనవాయి గ్రామంలో వెంకటేష్, నాగరాజు అనే రైతులు వారికున్న ఎద్దుల కోసం రెండు లక్షల రూపాయల వరకు పెట్టి పశుగ్రాసం కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. వెంటనే అక్కడున్న స్థానికులు ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేయడంతో అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

అప్పటికే పూర్తిగా కాలడంతో రైతులు అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి సహాయం చేయాలని కోరారు.

రైతుల సంకల్పం

● ప్రభుత్వ సహకారం

- ఉడ్మల్‌గిద్దలో సాగు యోగ్యం కాని 250 ఎకరాల్లో పంటలు
- దాదాపు 100 కుటుంబాల వలసలకు అడ్డుకట్ట
- నిధులు ఇస్తే మరో వంద ఎకరాలు సాగులోకి..

దామరగిద్ద, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాగుకు యోగ్యం లేని 250 ఎకరాల భూమిని సాగులోకి తెచ్చి బోర్లు వేసి పంటలు పండిస్తూ ఉమ్మడి జిల్లాకే ఆదర్శంగా నిలిచారు ఉడ్మల్ గిద్ద రైతులు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలంలోని 2017లో సామాజిక కార్యకర్త నిర్మల ఉడ్మల్‌గిద్దకు గ్రామానికి వెళ్లగా తమకు ప్రభుత్వం ఇచ్చిన భూములు పెద్ద పెద్ద రాళ్ల చెట్లతో వృధాగా ఉన్నాయన్న విషయాన్ని ఎస్సీ రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆమె అప్పటి జిల్లా కలెక్టర్ రోనాల్డ్ రోస్ దగ్గరకు విషయాన్ని తీసుకెళ్లగా.. కలెక్టర్ స్పందించారు. ఎకరాకు ఎంత ఖర్చు అవుతుందని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎక్స్‌కవేటర్‌తో రాళ్లను తొలగిస్తూ రూ. 20వేల ఖర్చు అవుతుందని తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ నుంచి ఎకరాకు రూ. 17వేలు ఇస్తానని రైతుల వాటా రూ. 3వేలు వేసుకొని సాగు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు రైతులు 'శ్రీలక్ష్మీ వెంకటేశ్వర రైతు సహకార సంఘం' ఏర్పాటు చేసి మొదటి విడతలో వంద ఎకరాలు సాగులోకి తెచ్చి పంటలు పండించారు. దీంతో రెండో విడతలో సాగులోకి తెచ్చి పంటలు పండించారు. రెండో విడతలో కలెక్టర్ హరిచందన నిధులు మంజూరు చేయడంతో 80 ఎకరాలు సాగులోకి తెచ్చారు. మూడో విడతలో అప్పటి కలెక్టర్ కోయ శ్రీహర్ష మంజూరు చేసిన నిధులతో 70 ఎకరాలు సాగులోకి తేవడంతో కంది, పెసర, పత్తి, పంటలు పండించారు. తమకు నీటి వసతి ఉంటే వేరుశనగ, కూరగాయలు పంటలతో మరింత ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కలెక్టర్ వెంటనే 11 బోర్లు మంజూరు చేశారు. వేసిన 11 బోర్ల ద్వారా నీరు అందిస్తున్నారు. వీటికి విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి మోటార్లు అమర్చి కనెక్షన్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ బోర్ల కింద వేరుశనగ, కూరగాయలు తరదిర ఆరుతడి పంటలు పండిస్తున్నారు. పొలాలకు వెళ్లడానికి బాటలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో వంద కుటుంబాలకు ఉపాధి లభించి వలసలకు అడ్డుకట్ట పడింది.

300 ఎకరాలు సాగుయోగ్యం కాని బీసీల భూమి..

బీసీల భూమి 300 ఎకరాలపైనే సాగుకు యోగ్యం లేకుండా ఉంది. అప్పటి కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ భూమిలో 13 ఎకరాల సాగులోకి తెచ్చేందుకు నిధులు మంజూరు చేశారు. ఒక్కో రైతుకు రూ. 13వేల చొప్పున ప్రభుత్వ నిధులు ఇస్తే రైతు వాటా కింద రూ. 10వేలు భరించి 13 ఎకరాలు సాగులోకి తెచ్చుకున్నారు. ప్రస్తుత కలెక్టర్ 300 ఎకరాలను సాగులోకి తేవడానికి నిధులు మంజూరు చేస్తే ప్రభుత్వం ఆర్థికంగా సహాయం అందిస్తే తమ వాటా వేసుకొని ఈ భూమిని సాగులోకి తెచ్చుకుంటామని బీసీ రైతులు కోరుతున్నారు.



కంది పంట సాగు చేసిన రైతు



ఉడ్మల్‌గిద్దలో సాగు చేసిన భూమిలో బోరు

మరో వంద ఎకరాలు సాగులోకి..

ప్రస్తుత కలెక్టర్ సిక్తా పట్నాయక్ నిధులు మంజూరు చేస్తే మరో వంద ఎకరాలు సాగులోకి తెస్తామని శ్రీలక్ష్మి వేంకటేశ్వర రైతు సహకార సంఘం సలహాదారు బుగ్గప్ప, అధ్యక్షుడు భింషప్ప, కార్యదర్శి ఉషాంతమ్మ, సభ్యులు కోరుతున్నారు.

ప్రస్తుతం నాల్గవ విడతలో అరవై ఎకరాలకు దరఖాస్తు చేసుకున్నామని నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరుతున్నారు. మిగతా 40 ఎకరాలకు అయిదో విడతలో నిధులు మంజూరు చేస్తే తమ ఎస్సీల భూమి అంతా సాగులోకి వస్తుందన్నారు.



సాగు చేయడానికి సిద్ధంగా ఉన్న భూమి

ప్రభుత్వ సహకారంతో..



ప్రభుత్వం నుంచి ఎకరాకు రూ. 17వేల చొప్పున నాలుగు ఎకరాలకు రూ. 68వేలు ప్రభుత్వ నిధులు ఇచ్చింది. రైతు వాటా కింద ఎకరాకు రూ. 3వేల చొప్పున నాలుగు ఎకరాలకు రూ. 12వేలు చెల్లించా. 4 ఎకరాల భూమిని సాగులోకి తెచ్చుకొని పంటలు పండించుకుంటున్నాను.

- బుగ్గప్ప, రైతు ఉడ్మల్‌గిద్ద

మద్దిమడుగు అంజన్నా.. మళ్లీ వస్తామయ్యా..

- 108 కలశాలచే కృష్ణానది జలాలతో మహా కుంభాభిషేకం
- హనుమాన్ గాయత్రీ మహాయజ్ఞం
- మద్దిమడుగు సన్నిధిలో వేలాది వాహనాలు, లక్షలాది భక్తులు
- మాలీజనే ప్రత్యేక నైవేద్యంగా అగ్నిగుండంలో సమర్పణ
- పాల్గొన్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ దంపతులు, నల్గొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్

పదర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లమలలోని మద్దిమడుగు పబ్బతి అంజనేయ పుణ్యక్షేత్రం భక్తులు, మాలాధారణ స్వాములతో కాషాయమంగా మారింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజైన ఆదివారం ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తజనం మళ్లీ వస్తామయ్యా మద్దిమడుగు అంజన్నా అంటూ శరణు కోరుతూ ఆలయం నుంచి తమ తమ ప్రాంతాలకు వెనుదిరిగారు. ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు వీరయ్య శాస్త్రీ, రుత్వికులు శివప్రసాద్ శర్మ, రఘుశర్మ, ఆలయ పాలక మండలి, మాలాధారణ స్వాముల సమక్షంలో మద్దిమడుగుకు 12 కిలో మీటర్ల దూరాన పారుతున్న కృష్ణానది జలాలను 108 కలశాలలో వేద మంత్రోచ్చారణల మధ్య, మంగళవాయిద్యాలతో తీసుకొచ్చి మహాకుంబాభిషేకం నిర్వహించారు. అదే విధంగా పంచామృతాలైన ఆవు పాలు, ఆవు నెయ్యి, తేనె, కొబ్బరిపాలు, పండ్ల కలయికతో మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించారు.

అనంతరం సింధూరాభిషేకం, బంతి, చామంతి, రోజా పూలతో పూలాభిషేకం చేసి వస్త్రాలంకరణ చేశారు. 10,016 తమలపాకులతో ఆకుపూజ, వడ మాల, గజమాల, తెల్లజిల్లేడు పూల మాలలతో అలంకరించారు. ధూపం వేయడంతో పాటు మంగళ హారతులు ఇచ్చి నైవేద్యం సమర్పించారు.

ఆలయ ప్రాంగణంలో...

ఒకపక్క గర్భగుడిలో పూజలు జరుగుతుంటే ఆలయ ఆవరణంలో మాలాధారణతో వచ్చిన భక్తులు ఆయా గురుస్వాముల సమక్షంలో మాల విరమణ చేశారు. అదే విధంగా గర్భగుడికి ఎదురుగా ఉన్న అగ్ని గుండం వద్ద భక్తులు గోదుమపిండి, ఆవునెయ్యి, బెల్లంతో తయారు చేసిన నైవేద్యం 'మాలీజ'ను బాహుజీ మంత్రాల మధ్య భక్తి శ్రద్ధలతో సమర్పిం చారు. చన్నీటి స్నానమాచరించిన మహిళా భక్తులు అగ్నిగుండం వద్ద ప్రదక్షిణలు చేస్తూ నిండు బిందే నీళ్ల, కుడకలు, ఆవునెయ్యి, అగరుబత్తీలు, నవ ధాన్యాలతో మొక్కులు చెల్లించుకున్నారు.



మాలీజ చేస్తున్న భక్తులు



హనుమాన్ గాయత్రి హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ దంపతులు

హనుమాన్ గాయత్రీ హోమం...

మార్గశిర శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయ సన్నిదిలో హనుమాన్ గాయత్రీ హోమం చేపట్టారు. రుత్వికులతో పాటు, జయరాం, శ్రీను గురుస్వాముల ఆధ్వర్యంలో భక్తిసంకీర్తనల మధ్య హనుమాన్ శరణఘోశ వినిపించారు. హోమం చివరన నవధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, వివిధ రకాల చెక్కముక్కలను, ఆ వునెయ్యి, పూర్ణాహుతిని హోమంలో సమర్పించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అనురాధ దంపతులతో పాటు, నల్గొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ నాయక్ పాల్గొన్నారు. ఆలయ చరిత్రను భక్తులకు అర్చకులు వివరించారు.

కోట మైసమ్మకు మొక్కుల చెల్లింపు...

పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయానికి తూర్పు ఈశాన్యంలో ఉన్న కోట మైసమ్మ అమ్మవారికి మహిళా భక్తులు పసుపు, కుంకుమ, గాజులు, చీర, సారెలతో వడిబియ్యం పోశారు. ఇంకొంత మంది భక్తులు బండారుతో, మేకలు, కోళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో గుండుఎత్తే కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.

అదే విధంగా చిన్న పిల్లలు జాతరలో ఆటల్లో మునిగిపోయారు. ఈ ఉత్సవాలలో అన్నదానం నిర్వహించారు. ఎస్సైలు రజిత, ఇందిర ఆధ్వర్యంలో 200 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ఈవో రంగాచారి, ఆలయ పాలక మండలి చైర్మన్ రాములు నాయక్, సభ్యు లు అల రాజు, శ్రీను, సుబ్బదాసు, వెంకట్ ఉన్నారు.

గోవింద నామస్మరణతో మారుమోగిన రామాపురం



వేంకటేశ్వరస్వామి కల్యాణానికి హాజరైన భక్తులు



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పెంట్లవెల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలో పురాతనమైన ఆలయంలో ఎతైన గుట్టపై వెలసిన అలివేలు మంగ సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకుడు శివకుమార్‌శర్మ మొదటగా గణపతి పూజ, శాంతి హోమం, అనంతరం 11.30 నిమిషాలకు వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం జరుగుతున్న సమయంలో ఏడుకొండల వాడ వెంకటరమణ గోవిందా గోవిందా అంటూ గోవింద నామస్మరణాలతో గుట్ట మార్మోగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులను ఉద్దేశించి ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లతో పాటు అన్నదానం నిర్వహించారు. స్వామి వారిని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కొల్లాపూర్ నియోజక వర్గ నాయకులు పగిడాల శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు నల్లవెల్లి చంద్రయ్య, కొమ్మరాజు, ఆకునమోని రాముయాదవ్, ఎల్‌ఐసీ నాగరాజు, నాయకులు కొమ్మ గోపాల్, యు. రామస్వామి, కలమూరి మధు, బచ్చలకూర బాలరాజు, కలమూరి నిరంజన్, గణమోని రాముడు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మల్దకల్ బ్రహ్మోత్సవాలకు వాహనాలలో తరలివస్తున్న భక్తులు

అన్ని వాహనాలు మల్దకల్ వైపే

● భక్తులతో కిక్కిరిసిన రహదారులు

మల్దకల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి రథోత్సవ కార్యక్రమం నిర్వహించడానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం ఉదయం 8గంటలనుంచే అయిజ-గద్వాల రహదారితో పాటు మద్దెలబండ, ఎల్కూరు, వైపు నుంచి మల్దకల్ వైపు వచ్చే అన్ని రహదారులు వివిధ రకాలైన వాహనాల రాకతో కిక్కిరిసిపోయాయి. వాహనాల సంఖ్య మధ్యాహ్నానికి మరింతగా పెరిగి 12 కిలోమీటర్ల దూరం వెళ్లడానికి 2గంటలకు పైగా సమయం పట్టింది. అన్ని వైపుల నుంచి వచ్చే వాహనాలను పోలీసులు మల్దకల్ గ్రామ శివారులో ఆపి వాటికి కేటాయించిన స్థలాలకు పంపుతూ ట్రాఫిక్ ఇబ్బందులు జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మధ్యాహ్నా సమయానికే మల్దకల్ పరిసర ప్రాంతాలన్నీ భక్త జన సందోహంతో నిండిపోయాయి. రాత్రి జరిగే రథోత్సవ కార్యక్రమం తిలకించడానికి అంచనాకు మించి భక్తులు వస్తున్నారని వారికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

హెచ్‌సీఏ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలువాలి

- ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్



ఉమ్మడి జిల్లా బాలుర క్రికెట్ జట్టుతో ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సురేష్, కోచ్ అబ్దుల్లా

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఏ క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. సోమవారం నుంచి హైదరాబాద్‌లో హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ సంఘం) అండర్-14 జిల్లాల క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు క్రీడాకారులు తరలివెళ్లాయి. ఆదివారం బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టు క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని ఆకాక్షించారు. హెచ్‌సీఏ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు అనేక విజయాలు సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రతిభ గల క్రీడాకారులను ఎండీసీఏ అండగా ఉంటుందని తెలిపారు. ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

● **అండర్-14 ఉమ్మడి జిల్లా బాలుర జట్టు:** కేతన్, హర్షిత్, సాయిరామ్, వెంకటసాయి, సుదేష్, అర్హన్, సృజన్, రామ్‌చరణ్, అకీల్, సోహెల్, దనుష్, హరివర్ధన్, జయచంద్ర, శ్రీమంత్‌రాజ్.

షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యవతకు డ్రైవింగ్‌లో శిక్షణ

మహబూబ్ నగర్ కలెక్టరేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా షెడ్యూల్ కులాల నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా లైట్ అండ్ హెవీ మోటారు వెహికిల్‌లను నడిపేందుకు ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి సుదర్శన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లైట్ మోటార్ వెహికిల్ లైసెన్స్ పొందేందుకు 18 నుంచి 35 సంవత్సరాలలోపు కలిగి ఉండి కనీసం 8 వతరగతి పాసై ఉండాలని తెలిపారు. హెవీ మోటార్ వెహికిల్ లైసెన్స్ పొందేందుకు 20 నుంచి 35 సంవత్సరాలలోపు కలిగి ఉండాలని, విద్యార్హత కనీసం 10వ తరగతి పాసై ఉండాలని ఆయన సూచించారు. ఉమ్మడి జిల్లాలోని షెడ్యూల్ కులాల యువతీ యువకులు దరఖాస్తుతో పాటు ఉత్తీర్ణత పొందిన సర్టిఫికెట్‌లు, అలాగే కుల, ఆదాయ ధ్రువపత్రాలు, మూడు ఫోటోలుజతపర్చి ఈనెల 20 లోపు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖజిల్లా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాలలో పలువురికి గాయాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. అలంపూరు, ఉండవల్లి, దామరగిద్ద, పదర మండల పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరుగగా, పలువురికి గాయాలయ్యాయి. జోగుళాంబ అమ్మవారి దర్శనం కోసం వస్తున్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోయినా వారు ప్రయాణిస్తున్న కారు బోల్తా పడింది.

అలంపూరుచౌరస్తా, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెండు వెర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు, వైద్యసిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు మహిళలు, ఒక చిన్నారి, ఒక వ్యక్తి అందరూ కలిసి జోగుళాంబ అమ్మవారి దర్శనం కోసం ఆదివారం బయలుదేరారు. మార్గంమధ్యలో ఉండవల్లి మండల పరిధిలోని, జోగుళాంబ రైల్వేహాల్ట్ సమీపంలో ప్రయాణిస్తున్న వీరి కారు టైరు పగిలిపోవడంతో పక్కనే ఉన్న పంట పొలాల్లోకి బోల్తాపడింది. కానీ కారులో ఉన్న వారెవరికి గాయాలు కాలేదు. దీంతో వారంతా కారును వదిలేసి అమ్మవారి దర్శనానికి వెళ్లిపోయారు. వారి పేర్లు తెలియరాలేదు.

పండ్ల వ్యాపారికి గాయాలు..

ఉండవల్లి మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై ఉత్తరఫీడ్స్ సమీపంలో గుర్తుతెలియని కారు పండ్ల వ్యాపారిని ఢీ కొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. కర్నూలు జిల్లా గోవర్ధగిరి గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి ఊరూరా పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవించేవాడు. అచ్చంపేట పట్టణంలో పండ్ల వ్యాపారం ముగించుకుని తిరుగు ప్రయాణంలో బైక్‌పై వెళ్తుండగా ఉత్తరఫీడ్స్ సమీపంలో గుర్తుతెలియని కారు ఢీకొంది. దీంతో మహేష్‌కు రెండుకాళ్లు, కుడి చేయి విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. తలకు హెల్మెంట్ ఉండటంతో అతడు ప్రా ణాలు దక్కించుకున్నాడని స్థానికులు తెలిపారు.



గాయపడ్డ వ్యక్తిని కర్నూలు ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది



అలంపూరు వద్ద పొలంలో బోల్తాపడిన కారు

ఆటో బోల్తా పడి...

దామరగిద్ద, (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి అయిదుగురికి గాయాలైన సంఘటన ఆదివారం నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల పరిధిలోని క్యాతన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ప్రత్యేక సాక్షుల కథనం ప్రకారం... దామరగిద్ద గ్రామానికి చెందిన అంజమ్మ తన ఇద్దరు కుమారులతో పాటు తన తోటి కోడలు తిరుపతమ్మతో కలిసి మద్దూరు మండలం చెన్నారం గ్రామానికి తమ బంధువుల ఇంట్లో జరుగుతున్న ఎంగేజ్‌మెంట్‌కు ఆటోలో వెళ్తుండగా క్యాతన్‌పల్లిలో ఆటో బోల్తా పడింది. దీంతో ఇద్దరు చిన్నారులు కిరణ్‌కుమార్, భానుతేజ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ముస్తాపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు అంజిలయ్య గౌడ్ తన మోటా రు సైకిల్‌పై నారాయణపేటలోని ప్రైవేటు ఆసుప త్రికి తరలించారు. వీరితో పాటు ఆటోలో వెళ్తున్న వారికి రక్తగాయాలయ్యాయి.

ఎదురెదురుగా ఆటో, బైక్ ఢీకొని..

పదర, (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా ఆటో, బైక్ ఢీకొని పలువురికి తీవ్ర గాయాలైన ఘటన నాగర్ కర్నూల్ జిల్లా పదర మండలంలోని ఉడిమిల్ల గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. చుట్టుపక్కల వారు తెలిపిన వివరాల ప్రకారం.. దేవర కొండ నుంచి మద్దిమడుగుకు ఆటోలో ప్రయాణికులు, ఎదురుగా మద్దిమడుగు నుంచి బైక్‌పై వస్తున్న యువకుడిని ఢీకొన్నది. దీంతో బైక్‌పై ఉన్న యువకునికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. అదేవిధంగా ఆటో బోల్తా పడటంతో అందులో ప్రయాణి కులకు కూడా గాయాలయ్యాయన్నారు. వెంటనే108కు సమాచారం ఇవ్వడంతో అమ్రాబాద్ సివిల్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. సీరియస్‌గా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అ చ్చంపేట సివిల్ ఆసుపత్రికి పంపినట్లు వైద్యులు వివరించారు. ఇదే విషయంపై పదర పోలీసులను అడగగా ఫిర్యాదు అందినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు గౌడ్ తెలిపారు.

ఇంటర్వ్యూ..

మండల అభివృద్ధికి కృషి

- ఇన్‌చార్జి ఎంపీడీవో బ్రహ్మాచారి



తాడూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను అమలుచేసి గ్రామాల అభివృద్ధిపై కృషి చేస్తానని ఎంపీడీవో బ్రహ్మాచారి అన్నారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శుల సహాయ సహకారాలతో మండల అభివృద్ధికి కృషి చేస్తు న్నానని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

మండలంలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, సమగ్ర సర్వే ఎలా జరిగింది ?

మండలంలోని 24 గ్రామాలలో 11,048 కుటుంబాలు ఉన్నాయి. అన్ని గ్రామాలలో సమగ్ర కుటుంబ సర్వే పూర్తయింది.

మండలంలో ప్రస్తుతం ఎలాంటి పనులు జరుగుతున్నాయి.

ప్రస్తుతం మండలంలో అభివృద్ధి పనులు కొంత మేర జరుగుతున్నాయి. గ్రామాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంచాయతీ కార్యదర్శుల ద్వారా తాగునీరు, అంతర్గత రహదారుల పరిశుభ్రత, మురికి కాల్వల నిర్వహణ వంటి వాటిపై దృష్టి పెట్టి ప్రజల కుఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం.

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎలాంటి కార్యాచరణ రూపొందించుకున్నారు?

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. రిజర్వేషన్లపై స్పష్టత రావాలి. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా దిగ్విజయంగా పూర్తి చేసేందుకు సంసిద్ధంగా ఉన్నాం.

న్యూస్ బాక్స్

కామన్ డైట్ పథకం విద్యార్థులకు వరం

వంగూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పోషకాహారంతో పాటు రుచికరమైన భోజనం అందించేందుకు 40 శాతం డైట్ చార్జీలు పెంచడం హర్షదాయకమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని విలేకర్లతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 3900 సంక్షేమ వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కామన్ డైట్ పథకం ద్వారా మేలు జరుగుతుందన్నారు. చార్జీల పెంపుతో ప్రభుత్వంపై రూ.470 కోట్ల అదనపు భారం పడినా సుమారు రూ.8లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని ఆయన తెలిపారు. సీఎంకు గురుకుల విద్యార్థులపై ప్రేమ లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మాటలను లక్ష్మారెడ్డి తీవ్రంగా ఖండించారు.

పూర్వ విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం

వంగూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన గెల్వయ్య ఇటీవల మృతి చెందాడు. 1992-93 విద్యా సంవత్సరానికి చెందిన తోటి పూర్వ విద్యార్థులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 18 వేల ఆర్థిక సహాయం అందజేశారు. గెల్వయ్య మృతి పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వేదమూర్తి, తిరుపతయ్య, లక్ష్మయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

జమ్మి చెట్టు పునః ప్రతిష్ఠ

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జాతీయ రహదారి 167కే విస్తీర్ణంలో పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న శమీ వృక్షాన్ని తొలగించారు. దీంతో ప్రత్యామ్నాయంగా గ్రామంలోని శివుని మాన్యంలో కొత్తగా జమ్మి చెట్టును ఆదివారం బ్రాహ్మణుల మంత్రోచ్చరణాలతో గ్రామ పెద్దలు ప్రతి ష్ఠించారు. హిందువులు ఎంతో ప్రతిష్టాత్మ కంగా కొలిచే దసరా పండుగ రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకోవడానికి వీలుగా తిరిగి జమ్మి చెట్టును ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో యూఎన్. నరసింహన్‌శర్మ, విజయ, గ్రామ పెద్దలు మాజీ ఎంపీటీసీ దండు నరసింహ, మాజీ సర్పంచు ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, సాయిప్రకాష్‌శెట్టి, రాగుల శ్రీనివాస్‌రెడ్డి, తగిలి కృష్ణయ్య, సింగిల్ విండో డైరెక్టర్ దండు చంద్రయ్య, అవ్వగారి లక్ష్మయ్య, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

స్థల వివాదంపై ఎంపీకి వినతి

గద్వాల టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో కొత్తగా నిర్మించ తలపెట్టిన జిల్లా కోర్టు భవనాల సముదాయ స్థలం వివాదాన్ని పరిష్కరించాలని గద్వాల సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు మోహన్‌రావు, పూడూరు అచ్చన్నగౌడ్ నాగర్‌కర్నూల్ లోక్‌సభ సభ్యుడు డాక్టర్ మల్లు రవిని కోరారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఉన్న ఎంపీని కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కోర్టు భవనాలను కలెక్టరేట్ సమీపంలోని పీజేపీ క్యాంప్ ఆవరణలో ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం మంజూరు చేసిన విధంగా అనంతపురం సమీపంలో అందుబాటులో ఉన్న స్థలంలో గద్వాల మెడికల్ కళాశాల, ఇతర విద్యాసంస్థల నిర్మాణానికి ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ విషయంలో ఎంపీ నుంచి సానుకూల స్పందన లభించిందని నాయకులు తెలిపారు.

అచ్చంపేట అభివృద్ధిపై ఎన్నో ఆశలు

- ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం
- ప్రధానంగా టూరిజంపై ఫోకస్
- నల్లమలకు సాగు, తాగునీరే లక్ష్యం
- విద్య, వైద్యానికి పెద్దపీట



అచ్చంపేట పట్టణ వ్యూ

అచ్చంపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అనగానే గుర్తుకు వచ్చేది అచ్చంపేట. అలాంటి అచ్చంపేట నియోజకవర్గం ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టిన గడ్డ కూడా కావడంతో అభివృద్ధిపై ప్రజల్లో ఎన్నో ఆశలు ఉన్నాయి. కాంగ్రెస్ ఏడాది పాలనలో భిన్నాభిప్రాయాలు ఉన్నా అచ్చంపేట అభివృద్ధి కోసం దాదాపు రూ.208 కోట్ల15 లక్షల నిధులను ఎమ్మెల్యే తీసుకొచ్చినట్లు ఆయా శాఖల గణంకాలు చెబుతున్నా యి. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కావడం వల్ల కలిసి వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి. టూరిజం శాఖకు కావలసిన వనరులు నల్లమలలో ఉండటంతో ఈ ప్రాతాన్ని టూరిజం హబ్‌గా తీర్చి దిద్దాలన్న ఎమ్మెల్యే సంకల్పం ఫలించ నుంది. ఇటీవల టూరిజం అభివృద్ధికి రూ.25 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

నిధుల మంజూరు ప్రతిపాదనలు

అచ్చంపేట నియోజకవర్గంలోని 8 మండలాల్లో అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ ప్రణా ళికలు సిద్ధం చేస్తున్నారు. కుల సంఘాల భవన నిర్మాణాల కోసం రూ.80 లక్షలు వెచ్చించారు. నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.52 కోట్లు, పీఆర్‌ఆర్ రోడ్ల కోసం రూ.9 కోట్లు, ఎంఆర్‌ఆర్ రోడ్ల మరమ్మతుల కోసం రూ.20 కోట్లు మంజూరయ్యాయి. కేఎల్‌ఐ కాలువల మరమ్మతుల కోసం రూ.కోటి, లింగాల చెరువు నిర్మాణం కోసం రూ.15 కోట్లు మంజూరయ్యాయి. విద్యతో పాటు వైద్యం కోసం అధిక నిధులు వెచ్చిస్తున్నారు. నియోజ కవర్గంలోని రాయిచేడు గ్రామంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాల నిర్మాణానికి రూ.25 కోట్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల స్టడీ హాల్ కోసం రూ.60 లక్షలు, శిథిలమవుతున్న పాఠశాలల మరమ్మతుల కోసం రూ.50 లక్షలు, సోషల్ రెస్పాన్స్ గ్రాంట్ నుంచి రూ.2కోట్లు నిధులతో గ్రామాలలో మౌలిక వసతుల కోసం, ఎన్టీఆర్ స్టేడియంలో స్విమ్మింగ్ పూల్, అడ్మినిస్ట్రేషన్ భవనంతో పాటు పీఏంఎస్‌డీ ద్వారా రూ.10కోట్ల నిధులతో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు, ఎమ్మెల్యే సొంత నిధులతో పబ్లిక్ క్లబ్‌కు రూ. 5లక్షలు, అండర్‌గ్రౌండ్ నిర్మాణాలకు రూ.కోటి, అంబగుడి దేవాలయ అభివృద్ధికి రూ.5లక్షలు, సివిల్ కోర్టులో వెహికల్ పార్కింగ్, బార్ అసోసియేషన్ భవన నిర్మాణం కోసం రూ.20లక్షలు, లింగాల మండలం బాకారం, బల్మూరు మండలం గట్టుతుమ్మెన్, ఉప్పునుంతల మండలం కంసానిపల్లి, అచ్చంపేట మం డలం సింగారం, అమ్రాబాద్, పదర కేంద్రాల్లో విద్యుత్ సబ్ స్టేషన్‌లు మంజూరు కాగా, అచ్చంపేట మినీ ట్యాంక్ బండ్ కోసం రూ.25 కోట్ల ప్రతిపాదనలు పంపారు. ఎస్సీ, ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ గ్రాంట్స్ నుంచి సీసీ రోడ్ల నిర్మాణాల కోసం రూ.10 కోట్లు, ఎన్ఆర్‌ఈజీఎస్ ద్వారా ఇప్పటికే రూ.5 కోట్లతో రోడ్ల పనులు పూర్తి చేసినట్లు తెలిపారు.

మూడు హైవేలకు మూలం అచ్చంపేట



అచ్చంపేట నియోజకవర్గం లోని మన్ననూర్ నుంచి దోమల పెంట వరకు రూ.7700 కోట్లతో కారిడార్ నిర్మాణం, భూత్పురు నుంచి అచ్చంపేట మీదుగా మద్దిమడుగు నేషనల్ హైవే నిర్మాణంతో పాటు కృష్ణానదిపై వంతెన ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. దేవరకొండ నుంచి అచ్చంపేట, లింగాల, కొల్లాపూర్ మీదుగా సోమశిల వరకు మరో నేషనల్ హైవేకు ప్రణాళికలు సిద్ధం చేశాం. దీంతో అచ్చంపేట నియోజకవర్గం మూడు నేషనల్ హైవేలతో కలుస్తుంది. యంగ్ ఇండియా నేషనల్ ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం మొదటి విడతగా రూ.150 కోట్లు, రెండో విడతలో రూ.150 కోట్లు మంజూరు కానున్నాయి. వంగూరు మండలా నికి రూ.279 కోట్లు మంజూరయ్యాయి. అభివృద్ధి అంటే అచ్చంపేట అన్నట్టుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో తీర్చిదిద్దుతాం.

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అచ్చం పేట

వైభవంగా దత్తాత్రేయ జయంతి



తిమ్మాజిపేట : గుమ్మకొండలో మహాపడి పూజ మహోత్సవం



కందనూలు : దత్తాత్రేయ స్వామి జయంతి సందర్భంగా పూజల్లో పాల్గొన్న భక్తులు

కందనూలు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మార్గశిర మాస పౌర్ణమి, దత్తాత్రేయ జయంతి పురస్కరించుకుని నాగర్‌కర్నూల్‌లోని రాంనగర్ కాలనీలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో దత్తాత్రేయ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ భక్తులచే దత్తాత్రేయ స్వామికి సామూహికం గా పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. దత్తాత్రేయ హోమం చేయడంతో గురుబలం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రామాలయం అన్నప్రసాద కమిటీ వారిచే అన్నప్రసాద వితరణ చేశారు. రామాలయ భజన మండలి సత్యసాయి భక్తులచే భక్తిశ్రద్ధలతో భజనలు చేశారు.

నేటి నుంచి ధనుర్మాస పూజలు

స్థానిక రామాలయంలో ఈ నెల 16 నుంచి సంక్రాంతి పండుగ వరకు 30 రోజుల పాటు ధనుర్మాస పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు శ్రీనివాసాచార్యులు, అర్థం రవీందర్ తెలిపారు. గోదాదేవిమాత, స్మరణ కుంకుమార్చన, పుష్పార్చన, సేవాకాలం తెల్లవారుజామున ఐదు గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. మల్లేష్, గొల్లరాములు, వల్వ శ్రీనివాసులు, శారద, భక్తులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామి జయంతి

కోడేరు : మండల కేంద్రంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆయి సచ్చిదానంద నిలయంలో దత్తాత్రేయస్వామి జయంతి పూజ కార్యక్రమాలు నిర్వ హించారు. గణపతి పూజ, దత్తాత్రేయ స్వామి అభిషేకం, వ్రతం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలు అమరవాది సుధా కరశెట్టి, గాయత్రి దంపతులు నిర్వహించారు. సత్యసాయి సేవ సమితి కన్వీనర్ రాఘ వేంద్రశర్మ, శ్రీను శెట్టి, యోగేంద ర్‌రెడ్డి, నర్సయ్యచారి, పర్వత్‌రెడ్డి పాల్గొన్నారు.



కోడేరులో శ్రీ సత్యసాయి బాబా మందిరంలో పూజలు

హనుమాన్ స్వాముల ఇరుముడి

మన్ననూర్ : అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో హనుమాన్ స్వాముల ఇరుముడి మహోత్స వాన్ని శనివారం ఘనంగా నిర్వ హించారు. స్థానిక హనుమాన్ ఆల యం ఆవరణలో స్వాములంతా ఇరుముడులతో ఆలయ ప్రాంగణానికి చేరుకొని ఆంజనేయ స్వామికి అభిషేకం పూజలు నిర్వహించారు. సాయంత్రం పాదయాత్రగా మద్దిమడుగు పబ్బతి అంజనేయ స్వామి సన్నిధానానికి భయలుదేరారు. హనుమాన్ గురుస్వాములు మల్లేష్, కోట్య, నిరంజన్, సైదులు, హతీరాం, ఆంజనేయులు, రవి పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి మహా పడి పూజ

తిమ్మాజిపేట : మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామంలో నరేందర్ గురుస్వామి ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో అయ్యప్ప స్వామి మహా పడి పూజ ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతి కుమారస్వామి లక్ష్మి అమ్మవార్లకు, 18మెట్లకు పూజలు చేసి అలంకరణ చేశారు. అయ్యప్పస్వామి భజన పాటలతో హోరెత్తించారు. గురుస్వాములు సుమంత్‌కుమార్, యాదాజీ, భరత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

ప్రశాంతంగా సాగిన గ్రూప్ 2 పరీక్షలు

బిజినేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆరు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన గ్రూప్ 2 ఉద్యోగ నియామక పరీక్షలు ప్రశాంతంగా సాగినట్లు తహసీల్దారు జనుంపల్లి శ్రీరాములు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ఆల్ సెయింట్స్ స్కూల్, పాలెంలోని ప్రభుత్వ ఎస్వీ డిగ్రీ కళాశాల, ఎస్వీ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రాల్లో మొత్తం 1635 మంది అభ్యర్థులకు గాను 997 మంది హాజరు కాగా 638 గైర్హజరు కావడంతో 61శాతం హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

● తెలకపల్లి : మండల కేంద్రంలో గ్రూప్-2 పరీక్షలు విజయవంతంగా జరుగుతున్నాయి. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శాంతినికేతన్, కేకే.రెడ్డి, మహాత్మాజ్యోతిరావుపూలే పాఠశాలల్లోని కేంద్రాల్లో మొత్తం 1574 మంది అభ్యర్థులకు గాను 767మంది అభ్యర్థులు హాజరయ్యారు. 780మంది గైర్హాజరయ్యారు.

లక్ష్మీనర్సయ్యకు ఎదిరేపల్లి మశమ్మ అవార్డు

- అవార్డు ప్రదానంలో హైదరాబాదు బుక్ ఫెయిర్ అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్



జిల్లా కేంద్రంలో ఎదిరేపల్లి మశమ్మ పురస్కారాన్ని స్వీకరిస్తున్న కవి గుంటూరు లక్ష్మీనరసయ్య

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దళిత సాహిత్యాన్ని అంబేద్కరిజం వైపు నడిపిన మార్గదర్శి కవి గుంటూరు లక్ష్మీనరసయ్య అని హైదరాబాదు బుక్ ఫెయిర్ అధ్యక్షుడు, కవి సంగమం అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సింగిల్‌విండో సమావేశ మందిరంలో ఎదిరేపల్లి మశమ్మ పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించారు. ఈ ఏడాది ఎదిరేపల్లి మశమ్మ పురస్కారాన్ని ప్రముఖ కవి, విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్యకు ప్రదానం చేశారు. పురస్కారం కింద రూ.20 వేల నగదుతో పాటు మెమెంటో, ప్రశంసా పత్రాన్ని అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ గుంటూరు లక్ష్మీనరసయ్య జీవితమంతా దళిత, బహుజన సాహిత్యానికి అంకితం చేశారన్నారు. విమర్శకునిగా కవిత్వ నిర్మాణ పద్ధతులు, సాహిత్య కళా విమర్శ, దళిత సాహిత్యం-తాత్విక దృక్పథం తదితర పుస్తకాలను రాశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎదిరేపల్లి మశమ్మ పురస్కార కమిటీ చైర్మన్ ఎదిరేపల్లి కాశన్న, సభ్యులు డాక్టర్ దశరథం, వక్తలు కోయి కోటేశ్వర్‌రావు, కోట్లవెంకటేశ్వర్ రెడ్డి, జెట్టి ధర్మరాజు, కవులు వనపట్ల సుబ్బయ్య, ముచ్చర్ల దినకర్, కందికొండ మోహన్, వహీద్‌ఖాన్, గుడిపల్లి నిరంజన్, బిల్లం శ్రీను, ప్రతాప్ కౌటిళ్య, కల్వకోలు మద్దిలేటి నాగవరం బాల్‌రాం, ఖాజా, దేవరాజు, బంగారయ్య యోగానందం పాల్గొన్నారు.

కబడ్డీ జట్ల ఎంపిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌ఐ మాధవరెడ్డి

కల్వకుర్తి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ సమీపంలోని సీబీఎం కళాశాల మైదానంలో జిల్లా జూనియర్, సీనియర్ బాలుర, బాలికల కబడ్డీ జట్లను ఎంపికచేశారు. కార్యక్రమానికి కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం. జనార్దన్‌రెడ్డి, ఎస్‌ఐ మాదవరెడ్డి, డీవైఎస్‌వో సీతారాంనాయక్‌లు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. సెలక్షన్‌లో 78 మంది బాలురు, 65 మంది బాలికలు హాజరవగా వీరిలో 18 మంది బాలురు, 18 మంది బాలికలను క్యాంపు శిక్షణకు ఎంపికచేశారు. ఈనెల 27 నుండి 30 వరకు జనగామలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలలో వీరు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. బాలికలు హైదరాబాద్‌లోని స్పోర్ట్స్‌అథారిటీ ఆఫ్ ఇండియా సెంటర్‌లో జరిగే కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని జిల్లా ప్రధానకార్యదర్శి యాదయ్యగౌడ్ తెలిపారు. అసోసియేషన్ సభ్యులు ప్రకాష్, రమేష్, మోహన్‌లాల్, భారతి, కోచ్ గణేష్ ఉన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

- షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చారగొండ శ్రీనివాస్



షూటింగ్ బాల్ జిల్లా స్థాయి ఎంపికలో పాల్గొన్న విద్యార్థులు

అచ్చంపేటటౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో క్రీడలలో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చారగొండ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని గౌతమి పాఠశాలలో నిర్వహించిన సెలక్షన్‌లో ఆయా పాఠశాల 60మంది విద్యార్థులు పాల్గొన్నారు. 19మంది బాల బాలికలను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థులకు బాల్స్‌ను బీబీఆర్ స్పోర్ట్స్ చైర్మన్ రమేష్‌బాబు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యుడు రాఘవేందర్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి పూజ



అన్నదాతలను సన్మానిస్తున్న స్వాములు

దోమలపెంట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నియమ నిష్టతో నలభై ఒక రోజులు భక్తితో పూజలు చేసి శబరిమలకు వెళ్లే ముందు ఇరుముడి పూజలు చేస్తామని గురుస్వామి కస్తూరి బుచ్చి రాములు పేర్కొన్నారు. ఆదివారం దోమలపెంటలో అయ్యప్ప గుడిలో దివంగత జగన్ మోహన్‌రావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పూజ కార్యక్రమంలో జంగయ్య, సిద్ధార్థ, బచ్చు శ్రీనివాసులు, రవీంద్ర బాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సగరులను విస్మరించే పార్టీలను ఓడిస్తాం

- సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌సాగర్



సగర సంఘం సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఎన్నికల్లో సగరులకు తగిన ప్రాధాన్యత ఇవ్వని విస్మరించే రాజకీయ పార్టీలను ఓడిస్తామని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని శ్రీపురం రోడ్డులో నెల్లికొండ కాంప్లెక్స్‌లో భవనంలో సగర సంఘం జిల్లా కార్యాయాన్ని రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం రూబీ గార్డెన్‌లో సగర సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనుసాగర్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో సగర సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. శేఖర్‌సాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సగరులను భవన నిర్మాణ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బీసీ-డీ గ్రూపు నుంచి బీసీ-ఎ గ్రూపులో చేర్చాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సగరులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర యువజన, మహిళా నాయకులు జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు పనులు ప్రారంభం



మన్ననూరులో బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మన్ననూర్, డిసెంబరు 15 : అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని నందిగడ్డ కాలనీలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ నిధులతో తాగునీటి బోరు డ్రిల్లింగ్ పనులకు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం భూమి పూజ చేసి ప్రారంభించారు. తమ కాలనీకి తా గునీటి వసతి కోసం బోరు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కాలనీ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు దాసరి శ్రీనివాసులు,బాలమ్మ, కోఆప్షన్ మాజీ సభ్యుడు రహీం, కాంగ్రెస్‌నాయకులు తుల్యా, రాజారాం, రమేష్, బుచ్చయ్య, సురేష్, జూలూరి సత్యనారాయణ, లోకనాథం, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్‌ను కట్‌చేస్తున్న మహిళలు

కల్వకుర్తి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెనో నైట్ బ్రదర్ అండ్ వర్కంటిన్ మెమోరియల్ ఎంబీ చర్చ్‌లో ఆదివారం స్త్రీల కూటమి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చ్‌ను శోభాయమానంగా అలంకరించారు. పాస్టర్ రెవరెండ్, జేబీ రాజు, పాస్టర్ అమ్మ ఆధ్వర్యంలో మహిళలు పెద్దసంఖ్యలో యేసుక్రీస్తును ఆరాదిస్తూ ప్రార్థనాగీతాలు ఆలపించారు. అనంతరం కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో శోభ, కవిత, సుభాషిని, వైదూర్య, స్వరాజ్యం, సుగుణమ్మ, పద్మ, బాలమణి, ఇందిరా, శ్యామల, కరుణ, శారా, సుచరిత తదితరులు ఉన్నారు.

మెస్ చార్జీలు పెంచడం హర్షణీయం

- తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు పరశురాం



హాస్టల్ విద్యార్థులతో తీన్మార్ మల్లన్న టీం సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచి అమలు చేయడం హర్షణీయమని తీన్మార్ మల్లన్నటీం జిల్లా అధ్యక్షుడు పరశురాం అన్నారు. ఆదివారం తీన్మార్ టీం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలుర ఎస్సీ ఎ-హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరశురాం మాట్లాడుతూ పేద విద్యార్థులుంటే ప్రభుత్వ హాస్టల్స్‌లో నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచిందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం సభ్యులు సల్మాన్‌ఖాన్, శివ, వసీం తదితరులు పాల్గొన్నారు.